సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 15 । జనవరి । 2024



గోవా రాష్ట్ర మద్యం పట్టివేత

గోవా రాష్ట్రం నుంచి మద్యం బాటిళ్లను తరలిస్తున్న ముగ్గురిని ప్రొద్దుటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 161 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. –IIలో



భవన నిర్మాణ కార్మికులకు వరాల జల్లు

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం కార్యాలయానికి స్థలం ఇవ్వడంతోపాటు, ఎమ్మెల్యే రాచమల్లు భూమి పూజ చేశారు. –IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.2/20.4

జిల్లాలో ఆదివారం 20.4 – 32.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

సంతోషాల క్రాంతి.. సంక్రాంతి



కడపలోని రాజీవ్ మార్గ్‌లో భోగి మంటలు



కడపలో రంగవల్లుల ముందు చిన్నారుల సంక్రాంతి సందడి

- భోగిమంటల సందళ్లు
- ముంగిళ్లలో రంగవల్లులు
- ఊరూవాడా పండగ సందడి

కడప కల్చరల్: ఏడాదిగా ఎదురుచూస్తున్న పెద్ద పండుగ సంక్రాంతి రానే వచ్చింది. ప్రకృతి పరవశించే సమయంలో....పంటలు దండిగా ఇంటికి చేరతాయన్న ధీమాతో రైతన్న కులాసాగా ఉన్న సమయంలో ఆశల ప్రతిరూపంగా అందరి ఇంట ఆనందాలు నెలకొనేలా కొత్త కాంతి వచ్చింది. జిల్లా వాసులు ఈ పండుగను ఘనంగా స్వాగతించారు. భోగిమంటలు, భోగి స్నానాలు ప్రతి ఇంటి ప్రాంగణంలో మెరిసే రంగవల్లులు, గంగిరెద్దుల సందళ్లు, హరిదాసుల సంకీర్తనలు, బంధువులతో ఇళ్లు కళకళలాడాయి. ఆదివారం భోగి పండుగతో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో తెల్లవారుజామున 4 గంటల నుంచే వీధులు మేల్కొన్నాయి. వీధుల్లో, రోడ్ల కూడళ్లలో ప్రజలు పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. పలుచోట్ల అర్ధరాత్రి నుంచే స్థానిక యువకుల ఆధ్వర్యంలో భారీగా భోగి మంటలు వెలిగాయి. ఇళ్లలో ఉన్న పాత సామగ్రి, వీధుల్లోని చెత్తాచెదారం కూడా భోగిమంటల్లోకి చేరింది. ప్రత్యేకించి యువకులు, పిల్లలు ఉత్సాహ భరితంగా భోగి మంటలు వేసుకున్నారు. మరికొందరు పండుగను స్వాగతిస్తూ బాణాసంచా పేల్చి ఆనందించారు. యువకులు ద్విచక్ర వాహనాలపై వీధుల్లో వేగంగా వెళుతూ 'హ్యాపీ సంక్రాంతి'అంటూ తమదైనశైలిలో శుభాకాంక్షలు తెలుపుతూ ఉత్సాహాన్ని ప్రదర్శించారు.

సంప్రదాయబద్ధంగా

ఉదయాన్నే పెద్దలు పిల్లలకు రేగుపండ్లతో ప్రత్యేకంగా భోగి స్నానాలు చేయించారు. పలుచోట్ల ఇళ్లలో గౌరీమాత పూజలు నిర్వహించారు. ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. కొందరు అర్ధరాత్రి సమయానికే ముగ్గులు వేయడం పూర్తి చేయగా, మరికొందరు తెల్లవారుజామున 4 గంటల నుంచి రంగవల్లులు తీర్చారు. ముగ్గుల మధ్య గొబ్బెమ్మను ఉంచి పూలతో అలంకరించారు. చిన్నారులు, పెద్దలు పోటీలుపడి గాలిపటాలను ఎగుర వేసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలను ప్రోత్సహిస్తూ పలుచోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలు కుటుంబాల్లో సంప్రదాయంగా పొంగళ్లు పెట్టుకుని పూజలు చేశారు. మరికొన్నిచోట్ల దోసెలను ఆరగించారు. విదేశాల్లో, పెద్ద నగరాల్లో స్థిరపడిన వారు, ఉద్యోగాలు చేస్తున్న వారు తరలి రావడంతో కొన్ని ఇళ్లల్లో బంధువుల సందడి కనిపించింది . ఉన్నంతలో సంప్రదాయాలను పాటిస్తూ సంక్రాంతిలో తొలిరోజు పండుగ భోగిని ఘనంగా నిర్వహించుకుని సంక్రాంతి లక్ష్మికి ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం మకర సంక్రాంతి పేరిట పెద్దల పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్ల హడావుడిలో మునిగిపోయారు.

రద్దీ తగ్గలేదు

పెద్ద పండుగను సొంత ఊళ్లలో, సొంత ఇళ్లలో నిర్వహించుకునేందుకు పెద్ద నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు కుటుంబాలతో ఆదివారం కూడా తమ ఇళ్లకు చేరుకున్నారు. దీంతో ఉదయం కడపలోని ఆర్టీసీ బస్టాండు, ఏడురోడ్ల కూడలి వద్ద పెద్ద ఎత్తున జనసందడి నెలకొంది. ముందే రిజర్వు కావడంతో టిక్కెట్లుపై ఎక్కువ డబ్బు చెల్లించి వచ్చామని పలువురు పేర్కొన్నారు. ప్రైవేటు బస్సుల హడావుడి ఎక్కువగా కనిపించింది. ప్రత్యేకంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడపడంతో రవాణాకు సంబంధించిన సమస్యలు తలెత్తలేదు.



భోగి మంటను వెలిగిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలి

పులివెందుల రూరల్: సంక్రాంతి అంటే సకల శుభాల పండగ అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా పట్టణంలోని లింగాల రోడ్డులో ఆయన మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహరరెడ్డితో కలిసి బోగి మంటలో కార్యక్రమంలో పాల్గొని బోగి మంటలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోగి మంటల ద్వారా చెడును పార దోలి మంచిని పెంపొందించు కోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించే సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా పండుగను జరుపుకుంటున్నారు. సంక్రాంతిని ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పార్నపల్లె రోడ్డులోని కోతి సమాధి ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబయ్య, నూతనంగా నిర్మించిన రాయల్ పంక్షన్ హాలు, లాడ్జీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో ఈశ్వరయ్య, మున్సిపల్ చైర్మెన్ వరప్రసాదు, మార్కెట్ యార్డు చైర్మెన్ చిన్నప్ప, సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధరరెడ్డి, బలిజ సంఘం అధ్యక్షుడు ప్రసాదు, కౌన్సిలర్లు, కోడిరమణ, పార్నపల్లె కిషోర్, డేనియల్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా దివంగత ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం ఆకేపాటి ఎస్టేట్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఎడ్లు పాల్గొన్నాయి. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పోటీలను ప్రారంభించారు. ఉత్సాహంగా సాగిన ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆకేపాటి తిలకించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి బహుమతులు అందించారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు టౌన్‌కు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ ఎడ్లకు ప్రథమ బహుమతిగా రూ.60 వేలు, వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం గోసులవారిపల్లికి చెందిన పామిరెడ్డి వెంకటరమణారెడ్డి ఎడ్లకు ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలే ప్రసాద్‌రెడ్డి ఎడ్లకు తృతీయ బహుమతిగా రూ.40 వేలు, వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలే సూరారెడ్డి ఎడ్లకు నాలుగో బహుమతిగా రూ. 30వేలు, వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం జంగంపల్లికి చెందిన పుత్తా నాగసుబ్బారెడ్డికి చెందిన ఎడ్లకు అయిదో బహుమతిగా రూ.20 వేలు, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మోడిమాకలపల్లికి చెందిన తోట తిరుపాల్‌రెడ్డి ఎడ్లకు ఆరో బహుమతిగా రూ.10 వేలు, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు టౌన్ వసంతపేటకు చెందిన ద్వార్శల చంద్రశేఖర్‌రెడ్డి, కల్లూరుకు చెందిన పగడాల నాగేష్ ఎడ్లకు సంయుక్తంగా ఏడో బహుమతిగా రూ.5వేలు, వైఎస్సార్ జిల్లా వీఎన్ పల్లి మండలం తలపనూరుకు చెందిన శంభురెడ్డి, బాల పెద్దిరెడ్డి ఎడ్లకు ఎనిమిదో బహుమతిగా రూ. 3వేలు అందించారు. అనంతరం ఆకేపాటి మాట్లాడుతూ ప్రజలందరూ సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గాలివీటి మదన్‌రెడ్డి, సుండుపల్లి మాజీ ఎంపీపీ యల్రబాపు అజంతమ్మ, నాయకులు చొప్పా యల్లారెడ్డి, రేణింతల చిన్నపరెడ్డి, నాగా పృథ్వీపతిరెడ్డి, కుందానెల్లూరు గోపిరెడ్డి, అజయరెడ్డి, ఏబీ మహేష్‌రెడ్డి, గడికోట సుబ్బారెడ్డి, ఎస్ జావీద్‌అలీ, పోలీ మురళీరెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, దాసరి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

కడప కార్పొరేషన్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ ఈ నెల 15, 16 వ తేదీల్లో జిల్లా లో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా నుంచి ఈ నెల 15వ తేదీ సోమవారం రాత్రి 7.30 గంటలకు బయలు దేరి రాత్రి 10.30 గంటలకు కడప ఆర్అండ్‌బి అతిథి గృహానికి చేరుకుని బస చేస్తారని, 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్అండ్‌బి అతిథి గృహంలో ప్రెస్ మీట్ నిర్వహిస్తారన్నారు. అనంతరం బాపట్ల జిల్లా అద్దంకి కి బయలుదేరి వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

కమనీయం..గోదా కల్యాణం

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో భోగి పండుగను పురస్కరించుకుని ఆదివారం శ్రీ గోదాదేవి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీ మహా విష్ణువు అంశ అయిన శ్రీ చెన్న కేశవ స్వామి , శ్రీ మహా లక్ష్మి అంశ అయిన గోదాదేవికి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. మొదట రక్షా సూత్రధారణ, కణ్యావరుణ విశేషార్చన కార్యక్రమాలను జరిపారు. అనంతరం వైభవోపేతంగా మాంగల్య ధారణ కార్యక్రమాన్ని చూసిన భక్తులు ఆనందపరవశులయ్యారు. చివరగా మాలికా పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా కొండ ప్రాంగణం గోవిందనామ స్మరణతో మార్మోగింది. కాగా తెల్లవారు జామున ధనుర్మాస ప్రాతఃకాల పూజను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకట సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసులు, పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



తాళిని చూపుతున్న వేద పండితుడు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

■ ఈ సందర్భంగా వేద పండితులు గోదా కల్యాణ ప్రాశస్త్యం గురించి భక్తులకు వివరించారు. శ్రీమహాలక్ష్మి అంశగా జన్మించిన విష్ణు చిత్తుని కుమార్తె అయిన గోదాదేవి మహా విష్ణువైన రంగనాథున్ని ప్రతి రోజూ పూల మాలతో అలంకరించి పూజించేది. తాను కూర్చిన పూలమాలను మొదట తానే ధరించి అది బాగుందని తలచిన తర్వాతే స్వామివారికి అలంకరించి భక్తితో పూజించేది. గోదాదేవి కలలో స్వామివారిని భర్తగా కోరుకోగా, ఇలలో కల్యాణం జరిగింది. శ్రీ మహాలక్ష్మి స్వర్గలోకం నుంచి భూలోకంలో కాలిడిన రోజు భోగి పండుగ రోజని, అందుకే ఈ రోజు జరిగే గోదా కల్యాణోత్సవాన్ని చూసిన వారికి సిరి సంపదలు, ఆయురారోగ్యాలు సమకూరుతాయని, పెళ్లి కాని యువతకు వివాహాలు జరుగుతాయని పురాణాలు వెల్లడిస్తున్నాయి.

క్లుప్తంగా

రూ.6.85 లక్షలు స్వాధీనం

దువ్వూరు : ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళుతున్న రూ.6.85లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇడమడక చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నూలు వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా కారు డిక్కీలోని బ్యాగ్‌లో రూ.6.85లక్షల బ్యాగ్‌ను ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండటంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. కారులోని వారిని విచారించగా తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండ నుంచి అన్నమయ్య జిల్లా మదనపల్లెకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న డబ్బును ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు అప్పగించామన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ముద్దనూరు : ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2లక్షల నగదును ఆదివారం సాయంత్రం స్థానిక చెక్‌పోస్టు వద్ద తనిఖీలో స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ నరేష్ బాబు తెలిపారు. సీఐ సమాచారం మేరకు కడప రహదారిలోని చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా అనంతపురం జిల్లా పామిడి గ్రామానికి చెందిన రాజు కడప వైపు నుంచి బొలేరో క్యాంపర్ వాహనంలో రూ.2లక్షల నగదుతో ప్రయాణిస్తున్నాడు. అతని వద్ద ఉన్న నగదుకు ఎలాంటి ఆధారప త్రాలు లేకపోవడంతో సొమ్మును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మరంగా తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కడప రైల్వేస్టేషన్‌లో ముందస్తుగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కడప రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రయాణికులకు సంబంధించిన బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే రైల్వే పార్సిల్ సర్వీసులో వచ్చిన పార్సిళ్లను తనిఖీ చేశామని ఎస్ఐ వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధిత వస్తువులను పార్సిళ్లలో బుక్ చేయరాదని, అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

వరకట్న వేధింపుల కేసు

కడప అర్బన్ : తన భర్త షేక్ మసూద్ తాహతర్, అతని తల్లి, సోదరులతో కలిసి తనను బంగారు, డబ్బు అదనంగా తీసుకుని రావాలని వేధిస్తున్నారని కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వక్కలపేటకు చెందిన షేక్ సాదియా అంజుమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు.

ప్రొద్దుటూరులో భారీగా గోవా రాష్ట్ర మద్యం పట్టివేత

- ముగ్గురు వ్యక్తులు అరెస్ట్
- ఇన్నోవా కారుతో సహా 161 మద్యం ఫుల్ బాటిళ్లు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : గోవా రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఇన్నోవా కారుతో పాటు 161 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్ వివరాలను అడిషనల్ ఎస్పీ ప్రేరణాకుమార్ మీడియాకు వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐ శివప్రసాద్ సిబ్బందితో కలిసి జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని చిన్నశెట్టిపల్లె క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో ప్రొద్దుటూరులోని అమృతానగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇన్నోవా కారులో అదే మార్గంలో వస్తుండగా పోలీసులు వాహనాన్ని ఆపారు. తనిఖీ చేయగా అందులో పెద్ద ఎత్తున గోవా రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలు ఉన్నాయి. వివిధ కంపెనీలకు చెందిన 161 మద్యం సీసాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న అమృతానగర్‌కు చెందిన కాటం వీరేంద్ర, కోగటం షరీఫ్, వడ్ల వెంకట నాగ చైతన్యలను అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. పెద్ద ఎత్తున మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న సీఐ రమణారెడ్డి, ఎస్ఐ శివప్రసాద్, సిబ్బందిని అడిషనల్ ఎస్పీ అభినందించారు.



అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు

రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రొద్దుటూరులో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని ఏఎస్పీ తెలిపారు. తగు ఆధారాలు లేకుండా వ్యాపారులు, సాధారణ ప్రజలు పెద్ద మొత్తంలో నగదును తీసుకెళ్లరాదన్నారు. రెండు రోజుల క్రితం మెయిన్‌బజార్‌లోని వాసు స్టూడియో సర్కిల్‌లో బిల్లులు లేకుండా తీసుకెళ్లున్న రూ. 35 లక్షల నగదును సీజ్ చేసినట్లు అడిషనల్ ఎస్పీ చెప్పారు. అనధికారికంగా మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే క్రికెట్ బెట్టింగ్, మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

ప్రమాదవశాత్తు మంటలో పడి రైతు మృతి

మదనపల్లె : మడి నాటేందుకు సేకరించిన చెత్తను తగలబెడుతూ, ప్రమాదవశాత్తు అందులో పడి రైతు తీవ్రంగా కాలిపోయి మృతి చెందిన ఘటన మండలంలోని పోతపోలు పంచాయతీ కొంకిరెడ్డిపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన కె.చెన్నారెడ్డికి భార్య గంగులమ్మ, కుమారుడు సురేంద్రరెడ్డి, కుమార్తె ఉన్నారు.

ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో చెన్నారెడ్డి వరి మడి నాటేందుకు పొలాన్ని చదునుచేసే క్రమంలో చెత్తను ఒకచోట కుప్పగా పోగు చేశాడు. కుప్ప తగులబెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడ్డాడు. వయోభారంతో లేవలేక మంటల్లోనే కాలిపోయాడు. గుర్తించిన స్థానికులు అతడిని మంటల నుంచి బయటకు తీసేలోపు మృతి చెందాడు. సంక్రాంతి పండుగ వేళ రైతు అగ్నికి ఆహుతి కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక దేవాంగ కళ్యాణ మండపంలో ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబానికి చేదోడుగా నిలవాలన్నారు. దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించేందుకు గత 14 ఏళ్లుగా సంక్రాంతి సందర్భంగా రంగవల్లుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేస్తున్నామన్నారు. ప్రథమ బహుమతి రూ.6వేల మిక్సీని గోదెన సునీత, ద్వితీయ బహుమతి రూ.5వేల మిక్సీని కాటం శిరీష, తృతీయ బహుమతి రూ.4వేల కుక్కర్‌ను మమతలకు అందచేశారు. 97 మందికి కన్సొలేషన్ బహుమతులుగా రూ.750 విలువచేసే వంటసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ రాగా నాగలక్ష్మి, కౌన్సిలర్ పోసా వరలక్ష్మి, సంఘం కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, గంగా జలంధర్, పోసా వేణు, రాగా నరసింహారావు, రామకృష్ణ, వెంకట సుబ్బరాయుడు, వెంకటాచలపతి, వుట్టి లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ, వుట్టి నాగశయనం

భవన నిర్మాణ కార్మికులకు ఎమ్మెల్యే రాచమల్లు వరాల జల్లు

- భవన నిర్మాణానికి 7 సెంట్ల స్థలం విరాళం, భూమి పూజ
- నిర్మాణానికి రూ.5లక్షలు విరాళం

ప్రొద్దుటూరు : పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలాం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వరాల జల్లు కురిపించారు. ఆదివారం సంఘం కార్యాలయానికి 7 సెంట్ల స్థలం ఇవ్వడంతోపాటు, ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తానని ప్రకటించారు. సంఘం కార్యాలయం పూర్తయి ప్రారంభం రోజున సంఘం పేరుతో రూ.50లక్షలు డిపాజిట్ చేసి నిధి ఏర్పాటు చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఏ ప్రభుత్వం వల్ల జరిగిందో గుర్తించి వారిని తిరిగి గెలిపించుకోవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 30 ఏళ్లుగా పడకేసిన అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో పరుగులు పెడుతోందన్నారు. స్థానిక టీడీపీ నాయకులు ఏనాడైనా ఏ ఒక్కరికైనా సహాయం చేశారా అని ప్రశ్నించారు. స్థానిక టీడీపీ నాయకులకు, తనకు గల వ్యత్యాసాన్ని గుర్తించి న్యాయం వైపు నిలవాలని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం 7 సెంట్ల స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్‌ను వారికి అందించారు. సంఘం కార్యాలయానికి 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి రూ.లక్ష చొప్పున ఇద్దరు రూ.2లక్షలు ప్రకటించారు. ఏపీజే అబ్దుల్‌కలాం భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మ వీరన్న మాట్లాడుతూ ఎంతో ప్రేమతో తమ సంఘానికి వరాల జల్లు కురిపించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి రుణపడి ఉంటామని, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, కమాల్ బాషా, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ యాదవ్, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఉప్పర మురళి, చౌడం రవి, తుపాకుల వెంకటరమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ఓబులేసు, సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



7 సెంట్ల డ్యాకుమెంట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండవ గాంధీబొమ్మ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యువకుడిని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుడు విద్యుత్‌నగర్‌కు చెందిన గోగుల వసంత్ నుంచి 28 క్వార్టర్ బాటిళ్ల మద్యం సీజ్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. కడప రిమ్స్ పీఎస్ పరిధిలో రాజంపేట రహదారిలోని వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న అక్కాయపల్లెకు చెందిన చంద్రశేఖర్‌ను సీఐ కె. రామచంద్ర తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 8 క్వార్టర్ బాటిళ్ల మద్యం సీజ్ చేశారు.

8 మంది జూదరుల అరెస్టు

రూ.లక్ష 10 వేలు స్వాధీనం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల పరిసర ప్రాంతల్లో వేర్వేరు చోట్ల పోలీస్ అధికారులు నిర్వహించిన దాడుల్లో 8 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1,10,000 నగదును స్వాధీనం చేసుకోన్నట్లు ఆదివారం పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. ఎస్. ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి కింద జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నాగిశెట్టి శ్రీనాథ్ మరో ముగ్గురు అలాగే ముద్దనూరు రహదారిలో ఉన్న పెన్నాబ్రిడ్జి వద్ద జూదమాడుతున్న వాసు, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బెంగళూరులో చోరీ.. కలికిరిలో రికవరీ

కలికిరి : కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నార్త్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన ద్విచక్రవాహనాలు కలికిరిలో ఉన్నట్లు కర్ణాటక పోలీసులు గుర్తించారు. దీంతో వారు వాటిని ఆదివారం కలికిరికి వచ్చి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. బెంగళూరుకు చెందిన ద్విచక్రవాహనాల చోరీ ముఠా అక్కడ ద్విచక్రవాహనాలు చోరీ చేసి కలికిరి, చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు కర్ణాటక పోలీసులు గుర్తించారు. కూపీ లాగి పెద్ద ఎత్తున వాహనాలు రికవరీ చేశారు. కలికిరి పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఫయాజ్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. బెంగళూరుకు చెందిన ద్విచక్ర వాహనాల చోరీ ముఠాతో సంబంధాలు కలిగి అక్కడ చోరీ చేసిన వాహనాలను ఇక్కడ విక్రయించేవాడు. వాహనాలు చౌకగా విక్రయిస్తుండటంతో చాలా మంది కొనుగోలు చేశారు. కర్ణాటకలో నిందితులను పట్టుకున్న పోలీసులు వాహనాల రికవరీలో భాగంగా ముందుగా ఫయాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించి, వాహనాలను రికవరీ చేశారు. స్థానిక పోలీసుల సహకారంతో కలికిరి మండల పరిధిలోనే 17 ద్విచక్రవాహనాలను గుర్తించి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉంచారు. కలికిరితో పాటు కలకడ, కేవీపల్లి, పీలేరు ప్రాంతాల్లో మొత్తం 45 ద్విచక్రవాహనాలను రికవరీ చేసినట్లు బెంగళూరు నార్త్ పోలీసులు తెలిపారు. నిందితులను అక్కడ అరెస్టు చూపనున్నట్లు తెలిపారు. చోరీ వాహనాల సమాచారం కలికిరిలో చర్చనీయాంశంగా మారింది.

అందమైన లోకాన్ని వదిలి.. అందని లోకాలకు

- ప్రియుడు, ప్రియురాలి జంట ఆత్మహత్య
- భర్తను వదిలి పరాయి యువకుడితో సహజీవనం
- అతడితోనూ గొడవలు.. నెమ్మదినివ్వని సంసారసుఖం

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిన్నపాటి గొడవలకే కట్టుకున్న భర్తను, కన్న బిడ్డలను వదిలేసి పరాయి పురుషుడి పంచకు చేరింది ఆ మహిళ. అవివాహితుడైన యువకుడితో కలసి ఉంటోంది. సహజీవనం కూడా మనశ్శాంతిని, నెమ్మదిని ఇవ్వలేకపోయింది. అనురాగాలు పెరగాల్సిన ఆ బంధంలో ఒకరిపై ఒకరికి అనుమానాలు తలెత్తాయి. ఇవి పెనుభూతంగా మారి స్టేషన్ వరకు తీసుకెళ్లాయి. పోలీసులు సర్దిచెప్పి పంపించినా ఆ జంట సంసార సాగరాన్ని ఈదలేకపోయారు. జీవితంపై విరక్తితో ఇద్దరూ ఒకేసారి చావాలనుకుని రైలు కిందపడి తనువు చాలించారు. విపరీత ఆలోచనలతో, సంతృప్తి లేని జీవనయానంతో మూడుపదుల వయస్సు నిండకుండానే ముల్లోకాలకు వెళ్లిపోయారు. వివరాలు.. కడప రవీంద్రనగర్‌కు చెందిన పాలకొండ్రాయుడు (26), నెహ్రూ నగర్‌కు చెందిన చందనారెడ్డి (29) ఆదివారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో కడప రైల్వే స్టేషన్‌లోని మూడో నంబర్ ప్లాట్ ఫామ్ చివరలో గూడ్సురైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. చందన రెడ్డి ఒకటిన్నర సంవత్సర క్రితం భర్తను, ఇద్దరు కూతుళ్లను వదిలేసి ఏడు నెలలుగా పాలకొండ్రాయుడుతో సహజీవనం చేస్తోంది. పాలకొండ్రాయుడుకు చిన్నప్పు డే తల్లిదండ్రులు మరణించగా చిన్నాయన, పెదనాన్నల వద్ద పెరుగుతూ డిప్లొమా మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ప్రొద్దుటూరు ఆర్‌వీకే హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను అవివాహితుడు. భర్తను వదిలిపెట్టిన చందనా రెడ్డి కడపలోని శ్యాంసంగ్ సర్వీస్ సెంటర్‌లో పని చేస్తూ ఉండేది. ఈ క్రమంలో వారిద్దరికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త సహజీవనం వరకు తీసుకెళ్లింది. వీరిరువురు ఏడు నెలలుగా ఒకే ఇంటిలో కలిసి ఉంటున్నారు. ఇటీవల వీరి మధ్య గొడవలు తలెత్తి చిన్న చౌక్ చౌక్ పోలీస్ స్టేషన్లో పంచాయతీ జరుగ్గా పోలీసులు ఇరువురికి సర్దిచెప్పి పంపించారు. అయితే ఈ జంట అనూహ్యంగా రైల్వే స్టేషన్‌లో ఆత్మహత్యకు పాల్పడడం కడపలో కలకలం రేపింది. మృతుల సమాచారాన్ని వారి బంధువులకు తెలియశారు. ప్రస్తుతం యువకుడి తరపు బంధువులు రావడంతో విచారిస్తున్నట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రిమ్స్ మార్చురీకి తరలించినట్లు రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.



పాలకొండ్రాయుడు (ఫైల్)



చందనారెడ్డి (ఫైల్)



రైలు పట్టాలపై పాలకొండ్రాయుడు, చందనారెడ్డి మృతదేహాలు

భయం, భక్తి లేకపోతే ఇంతేనేమో..!

సంసార జీవితంలో చిన్నపాటి గొడవలు సహజమే. అలాగని కట్టుకున్న భర్తను, పేగుబంధం పెనవేసుకున్న కన్న బిడ్డలను వదిలేసి పరాయి పురుషుడి పంచకు చేరడం ఆమె చేసిన మొదటి తప్పు. పెద్దలకు భయపడకపోయినా కనీసం సమాజానికైనా భయపడి ఉండాల్సింది. కానీ అన్నీ గాలికి వదిలేసి అవివాహితుడైన పురుషుడితో సహజీవనం కొనసాగించడం ఆమెలోని విపరీత ధోరణిని ప్రస్ఫుటం చేస్తోంది. అక్కడ కూడా ఏదో తెలియని అశాంతి.. ఒకరి మనసులను మరొకరు అర్థం చేసుకోలేకపోవడంతో జీవితంపై వైరాగ్యం పెరిగింది. నిజమే! భర్త దగ్గర పోగొట్టుకున్న ఆప్యాయతలను పరాయి పురుషుడి వద్ద పొందుతామనుకోవడం వట్టి భ్రమ. కట్టుకున్నోడు వదిలేసినా పుట్టింటికి చేరి తల్లిదండ్రుల భయం భక్తిలో ఉండిఉంటే.. ఏదో ఒక రోజు భర్త, పిల్లల దగ్గరికి చేర్చేవారేమో. భార్యాభర్తల సంసార బంధంలో పెనవేసుకున్న అనురాగానికి.. ప్రియుడు, ప్రియురాలి మధ్య మొలకెత్తిన వ్యామోహానికి కొండంత తేడా ఉందనే విషయాన్ని ఈ సంఘటన రుజువు చేస్తోంది.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సర్వాంగ సుందరంగా హైస్కూళ్లు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యంగా హైస్కూళ్లను సర్వాంగ సుందరంగా మార్చింది. మైదుకూరు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. గతంలో వీరికి సరిపడా టాయిలెట్స్ ఉండేవి కావు. తరగతి గదుల్లో కూడా పాత బెంచీలు ఉండేవి. నాడు–నేడు కార్యక్రమం కింద ఈ పాఠశాలలకు రూ.1.04 కోట్లు మంజూరైంది. ఆ నిధులతో అదనపు మరుగుదొడ్లను నిర్మించడమే కాక, ఆధునిక సౌకర్యాలను కల్పించారు. పాఠశాల ఆవరణం రంగురంగుల టైల్స్‌తో ఆకర్షణీయంగా మారింది. పాఠశాల భవనాలు కొత్త రూపును సంతరించుకున్నాయి. తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డ్స్‌ను ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన సులభతరమైంది. కొత్త డెస్కులు సమకూరాయి. ఇవి కాక పిల్లలకు యూనిఫాం, జగనన్న విద్యాకానుక ద్వారా పుస్తకాలు, బెల్టు, బూట్లు, సాక్సులు, జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. విద్యపై ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయం.

- ఎం.రమాదేవి, హెడ్మాస్టర్, బాలుర హైస్కూల్, మైదుకూరు

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ సచివాలయం ద్వారానే వస్తాయని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాము. రెండు రోజుల వ్యవధిలోనే దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగానే అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ కూడా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము.

- ఏనుగు వెంగమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

ప్రొద్దుటూరు అడిషనల్ ఎస్పీ బదిలీ

బీహార్ రాష్ట్ర క్యాడర్‌కు బదిలీ అయిన ప్రేరణాకుమార్



ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు అడిషనల్ ఎస్పీ ప్రేరణాకుమార్ బదిలీ అయ్యారు. ఆమెను బీహార్ రాష్ట్ర క్యాడర్‌కు బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె భర్త హిమాన్షు బీహార్ రాష్ట్రంలో ఐపీఎస్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. దీంతో తనను బీహార్ క్యాడర్‌కు బదిలీ చేయాల్సిందిగా ప్రేరణాకుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. 2019వ బ్యాచ్‌కు చెందిన ప్రేరణాకుమార్ స్వస్థలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్. 2022 ఆగస్టు 30న ఆమె ప్రొద్దుటూరు ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. బీహార్ క్యాడర్‌కు బదిలీ అయిన నేపథ్యంలో నాలుగైదు రోజుల్లో ఆమె రిలీవ్ కానున్నారు.

ప్రొద్దుటూరులో పని చేయడం సంతృప్తిని ఇచ్చింది

ప్రొద్దుటూరులో పని చేయడం తనకు ఎంతగానో సంతృప్తిని ఇచ్చిందని అడిషనల్ ఎస్పీ ప్రేరణా కుమార్ తెలిపారు. ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసిన అనంతరం గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండర్‌గా పని చేశానన్నారు. అక్కడి నుంచి ప్రొద్దుటూరుకు బదిలీ అయినట్లు చెప్పారు. ప్రొద్దుటూరు సబ్‌డివిజన్‌లో పని చేసిన అనుభవం భవిష్యత్తులో తనకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. విధి నిర్వహణలో ప్రొద్దుటూరు ప్రజలు తనకు ఎంతగానో సహకరించారన్నారు. ఏదైనా ఆపద వస్తే సహాయం చేసే గుణం ఇక్కడి వారిలో ఎక్కువగా ఉందని చెప్పారు. ప్రొద్దుటూరు ప్రజల ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరచిపోనని పేర్కొన్నారు.